క్లుప్తంగా

నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం శ్రీదన్వి కళానిలయం విద్యార్థులు నృత్యార్చన చేశారు. ఇందులో శ్రీగణపతి సేవింపరారే, పలుకే బంగారం, వినరో భాగ్యము అంశాలతో అలరించారు. కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

మియాపూర్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య కల్యాణోత్సవం జరిపించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

జేఈఈ మెయిన్‌లో సత్తా చాటిన గురుకుల బాలికలు

రాయదుర్గం: జేఈఈ మెయిన్‌లో గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. కళాశాల నుంచి 110 మంది పరీక్ష రాయగా, అందులో 81 మంది జేఈఈ అడ్వాన్స్‌కు క్వాలిఫై అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ శారద శనివారం చెప్పారు. వర్ష 97.93 పర్సంటైల్ సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. నవ్యశ్రీ 95.32, శ్రీవిద్య 94.86, కీర్తి 94.67, అశ్విని 92.65, పింకీ 91.84, గౌసియా 91.55, శిరీష 91.15, వి స్వాతి 90.97 పర్సంటైల్ సాధించారు.

గౌలిదొడ్డి గురుకుల బాలుర కళాశాలలో.. గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు 95 మంది పరీక్ష రాయగా 80 మంది జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఎస్ రామకృష్ణ 98.98 పర్సంటైల్, ఎంరంజిత్ 98.75, బి సాత్విక్ 97.98, ఏ రామ్‌రెడ్డి 97.19, ఏ అనుదీప్ 96.50, వి జశ్వంత్ 96.12, సీహెచ్‌నాగరాజు 95.13 పర్సంటైల్ సాధించారని ప్రిన్సిపల్ పాపారావు తెలిపారు.

కొలువుదీరిన వైశ్యా బిజినెస్ నెట్‌వర్క్ అపెక్స్ బాడీ

హఫీజ్‌పేట్ : గచ్చిబౌలి కొండాపూర్‌లోని లీ మెరిడియన్ హోటల్‌లో శనివారం వైశ్యా బిజినెస్ నెట్‌వర్క్ అపెక్స్ బాడీ (2023-24) ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్మన్‌గా సీఏ రాజేష్ డోంకేశ్వర్, కార్యదర్శి సీఏ వేముల చంద్రశేఖర్, కోశాధికారి శ్రీనివాస్ కల్లూరి బాధ్యతలు స్వీకరించారు.

భార్యతో గొడవపడి..

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి ఓ భర్త అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని కట్టపోచారం గణపతిగూడేనికి చెందిన కృష్ణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 28వ తేదీన భార్య సునీతతో గొడవ పడి ఉదయం పదిగంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తండ్రి దుర్గయ్య ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నయనానందకరం కథక్ నృత్యోత్సవం



మాదాపూర్: శిల్పారామంలో శనివారం అంతర్జాతీయ నృత్యోత్సవాన్ని నిర్వహించారు. పరంపర డ్యాన్స్, మ్యూజిక్ ఫోరమ్ ప్రముఖ కథక్, విలాసిని నృత్య కళాకారులు గురువు సంజయ్ జోషి, సంయుక్త నిర్వహణలో జంటనగరాలలో ఉన్న కథక్ నృత్యగురువులు, ,శిష్య ప్రశిష్యులతో నృత్యోత్సవాన్ని నిర్వహించారు. వివిధ నృత్యరీతులలో లక్నో ఘరానా, జైపూర్ ఘరానా గురువులతో పాటు శిష్యగణం గురు వందన, శివ్‌వందన, సరస్వతి వందన, దశావతార, బసంత్‌రాస్, సర్గం, హోలి, తరణ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు ఆర్తి శంకర్, యోగిని ఖరోస్కర్, అర్చన మిశ్ర, శ్రీవల్లిరావు, సుబ్రత్‌సర్కార్, శిల్పచక్రవర్తి, కుమారస్వామి, మోహనరెడ్డి, పూనమ్ జాంవల్లే తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడు అరెస్ట్

మాదాపూర్: సైబర్ నేరస్తుని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మాదాపూర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్‌మోరే అనే వ్యక్తి బ్యాంక్ అకౌంట్ నుండి రూ.43వేల రూపాయలు లావాదేవీలు జరిగినట్టు తెలుపడంతో కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడు జైపాల సుభాష్‌కుమార్ (24) ప్రైవేటు ఉద్యోగి, ఉప్పుగూడ, హైదరాబాద్‌కు చెందిన వాడిగా గుర్తించి అరెస్ట్ చేసి నిందితుని వద్ద నుండి 20వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

కన్నీరే..

మునిగిన వాణిజ్య సెల్లార్లు.. లక్షల్లో ఆస్తినష్టం

మియాపూర్: జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా వరద నీటి కాలువ పనులు చేపట్టారు. అయితే నెలల తరబడి పనులు సాగు..తూనే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ప్రవహించేందుకు సరైన కాలువలు లేకపోవడంతో పక్కన ఉన్న సెల్లార్‌లలోకి నీరు చేరడంతో దుకాణాలు మునిగిపోయాయి. అందులో ఉన్న స్టాక్ పూర్తిగా తడిసిపోయింది. లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది.

- శేరిలింగంపల్లిలోని బీహెచ్ఇఎల్ వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా చందానగర్ బస్టాప్ వరకు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు.
- పనులు చేపట్టే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ రహదారి విస్తరణ పనులు ఆరు నెలల ముందు చేపట్టారు.
- జాతీయ రహదారి పక్కన గతంలో ఉన్న వరద నీటి కాలువను తీసివేసి ప్రస్తుతం సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న వ్యాపార సముదాయాలను ఆనుకొని వరద నీటి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. దీని కోసం పెద్ద పెద్ద గుంతలు తవ్వారు.
- ఈ గుంతలను రెండు నెలల ముందు తవ్వి పనులు చేపట్టకుండా వదిలేశారు.
- ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారిపై నుంచి వరద నీరు గుంతల్లోకి చేరడం వరద నీరు సాఫీగా ప్రవహించకపోవడంతో ప్రక్కనే ఉన్న సెల్లార్లలోకి చేరడంతో దుకాణాలు పూర్తిగా మునిగిపోయాయి.
- చందానగర్‌లోని వినీత బ్యాక్, ఎస్ఆర్ మెడికల్ అండ్ సర్జికల్, న్యూ ఫాస్ట్ లైన్, టూర్స్ అండ్ ట్రావెల్స్ దుకాణాలు నీటిలో మునిగిపోయాయి.
- అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని తమకు నష్ట పరిహారం ఇప్పించాలని దుకాణ యజమానులు చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.




చందానగర్ జాతీయ రహదారి పక్కన దుకాణాల ముందు గుంతలు





నీట మునిగిన దుకాణాలు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

గచ్చిబౌలి: పేద, మధ్యతరగతి వారికి సీఎం సహాయనిధి ఆర్థిక భరోసానిస్తోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌కు చెందిన ప్రభుదాస్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన లక్ష రూపాయలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, విఠల్, మధు, రాము, రాధాబాయి పాల్గొన్నారు.



సిద్ధిఖీనగర్‌వాసికి సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఏబీవీపీ హెచ్‌సీయూ నూతన కార్యవర్గం

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ యూనిట్ నూతన కార్యవర్గాన్ని నూతన అధ్యక్షుడు అక్షయ్‌అంగుల్వార్ శనివారం ప్రకటించారు. నూతన కార్యదర్శిగా ఆకాష్‌ఖాటి, ఉపాధ్యక్షులుగా అయేషా, తరుణ్‌శర్మ, రవిరంజన్, తులసీరామ్, ఫణిందర్, సంయుక్త కార్యదర్శులుగా ఆశిష్, రితాంజలి, శ్రితికా, పృధ్వి, వికాస్, ఎస్‌హెచ్‌ఓ డీహెచ్ కన్వీనర్‌గా బాలకృష్ణ, కో కన్వీనర్‌గా నిషా, గర్ల్స్ కన్వీనర్‌గా సాక్షి, కోకన్వీనర్‌గా లహరికా, సోషల్ మీడియా కన్వీనర్ అవినాష్, కో కన్వీనర్ గా అభిలాష్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్‌గా కపిల్‌దేవ్, కోకన్వీనర్‌గా నరేందర్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా దృభ జ్యోతి, కోకన్వీనర్‌గా బిప్లబ్, కేల్ కన్వీనర్‌గా వీరా చారి, కోకన్వీనర్‌గా రమ్యా, ఆర్‌కేఎం కన్వీనర్‌గా నేహా యాదవ్, కోకన్వీనర్‌గా శ్యామ్, నేషనలిస్ట్ కన్వీనర్‌గా యశస్వి కో కన్వీనర్లుగా దక్ష, శౌర్య, స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా అభిగ్నమ్ రంజన్, కోకన్వీనర్‌గా దేవేందర్, నార్త్ క్యాంపస్ ఇన్‌చార్జీగా సౌరభ్, సౌత్ క్యాంపస్ ఇన్‌చార్జీగా దినేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రేయ్‌తేచన్, వినమ్‌త్రిపాఠి, సంగమేష్ రెడ్డి, చరణ్య, వికాస్, శ్రీకాంత్,దిప్షిక, దయాకర్, అమృత్, శివప్రియ, మోహన్‌చౌదరి, క్రై లాష్‌ను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు.అనంతరం అక్షయ్ అంగుల్వార్ మాట్లాడుతూ ఏబీవీపీ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో హాస్పిటల్ టూర్‌లు

- టెలీమెడిసిన్, ఆన్‌లైన్ సేవలు అందిస్తాం
- మెడికేర్ ఆసుపత్రి సీఈఓలు సురేష్, దినేష్ గౌడ్

హఫీజ్‌పేట్ : సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హాస్పిటల్ టూర్ పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మెడికేర్ ఆస్పత్రి సీఈవో, డైరెక్టర్, డాక్టర్ సురేష్, సీఈవో దినేష్‌గౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం మియాపూర్ మెడికేర్ ఆస్పత్రిలో హాస్పిటల్ టూర్ కార్యక్రమంలో భాగంగా వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైద్యం విషయంలో ఎటువంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా ముంబై, చెన్నై, ఢిల్లీలాంటి నగరాలకు వెళ్ళేవాళ్ళమని కానీ ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ప్రపంచస్థాయి వైద్యం అందుతోందన్నారు. మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో హాస్పిటల్ టూర్ కార్యక్రమంలో భాగంగా తొలుత ఎంపిక చేసిన కొన్ని గ్రామాల్లో తమ ఆస్పత్రి నుంచి వైద్యులతో పాటు సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉచితంగా వైద్యం అందించడంతో పాటు వారికి అవసరమైన మందులు సైతం ఇస్తామని వెల్లడించారు. తమ సంస్థ ద్వారా టెలీమెడిసిన్ సేవలు, ఆన్‌లైన్ సేవలు కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జనరల్ సర్జన్ డాక్టర్ కృష్ణ చైతన్య, న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆనంద్, డాక్టర్ రంగనాథ్, యూరాలజిస్ట్ డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓలు సురేష్, దినేష్‌గౌడ్


కార్పొరేట్ రాణా



రాయదుర్గం పీఎస్ రిసెప్షన్

రాయదుర్గం పీఎస్‌కు సరికొత్త హంగులు

గచ్చిబౌలి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో రాయదుర్గం పీఎస్‌ది ప్రత్యేక స్థానం. 5 ఎస్, 17 వర్టికల్ అమలు ప్రక్రియ ఈ పీఎస్ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డి రాయదుర్గం పీఎస్‌ను సందర్శించి 5 ఎస్, 17 వర్టికల్ అమలు తీరును ప్రశంసించారు. ఈ పీఎస్‌కు లక్ష రివార్డు అందజేశారు. ప్రస్తుతం రాయదుర్గం పీఎస్‌లోకి అడుగు పెడితే కార్పొరేట్ లుక్ కనిపిస్తుంది. ఇంటీరియర్ డిజైన్ ఇట్టే ఆకట్టుకుంటోంది. కొద్ది నెలల క్రితం ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన మహేష్ పీఎస్ ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. రిసెప్షన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మెయిన్ రిసెప్షన్, 17 వర్టికల్స్‌తో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లోని విభాగాలను ఆధునికీకరించారు. రెండో దశలో మొదటి అంతస్తులోని క్రైం విభాగం, రికార్డుల గది, సిబ్బంది విశ్రాంతి ప్రదేశాన్ని మార్పు చేస్తామని సీఐ మహేష్ తెలిపారు.



మెయిన్ రిసెప్షన్‌లో ఫిర్యాదుదారులు రాసుకునేందుకు ఏర్పాటు చేసిన టేబుల్

నాలా విస్తరణతో సమస్యకు శాశ్వత పరిష్కారం

- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: లింగంపల్లి అండర్ బ్రిడ్జి నుంచి వరద నీరు సాఫీగా వెళ్ళేలా నాలాను విస్తరించనున్నట్లు ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నాలాను విస్తరించేందుకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు చేశామని, అనుమతులు రాగానే పనులు చేపడతామని వివరించారు. కొద్దిపాటి వర్షం పడినా వాహనదారులు, ఉద్యోగులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. నాలా విస్తరణతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లు శ్రీనివాస్, శ్రీకాంతిని, ఏఈ సునీల్, బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 11 మంది కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 8 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

ఎస్‌టీపీ పనుల పరిశీలన

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని లింగంకుంటలో ఎస్‌టీపీ నిర్వహణ, పనితీరును ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు ఎస్‌టీపీలో ఎక్కువ వరద నీరు వస్తుందన్నారు. ఎస్‌టీపీలో నీటి శుద్ధీకరణను వేగవంతం చేయాలని ఎస్‌టీపీ నిర్వహణ మెరుగు పర్చుకోవాలని సూచించారు. నిర్వహణ పై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.మియాపూర్ పటేల్ చెరువు, గంగారం పెద్ద చెరువు, దుర్గం చెరువు, ఖాజాగూడ చెరువు, అమీర్ చెరువు, ఎల్లమ్మ కుంట, పరికి చెరువులలో ఎస్‌టీపీ నిర్మాణ పనులకు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టాటూస్‌కు ఆదరణ

గచ్చిబౌలి: సృజనాత్మకత కలిగిన కళాకారులు వేసే టాటూస్‌కు మంచి ఆదరణ ఉందని ఎలియన్స్ టాటూ హైదరాబాద్ ఫ్రాంచైజీ యజమాని అమృత్‌పాల్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని ఎలియన్స్ టాటూ హైదరాబాద్ స్టూడియో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాకారుల లైవ్ ప్రదర్శనలు, కళాఖండాలను ప్రదర్శించారు.

ఒక్క వానకే పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

గచ్చిబౌలి: ఒక్క వానకే పొంగిపొర్లుతున్న డ్రైనేజీ, అస్తవ్యస్తంగా మారిన కాలనీలతో ప్రజలు అవస్థల పాలవుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు.గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి మస్తాన్‌నగర్, గుట్టలబేగంపేటలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే శేరిలింగంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామమన్నారు. బీజేపీ నాయకులు జయలక్ష్మీ, ఆంజనేయులు, చంద్రశేఖర్,లక్ష్మణ్,సాయి, డేవిడ్, అజమ్, నాగార్జున, ఎల్లేష్ పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో మురుగునీరు పొంగుతోంది. కాలనీలోని శ్రీ రామాలయం రోడ్డులో వచ్చే మురుగుతో కాలనీవాసులు, వాహనదారులు అవస్థల పాలవుతున్నారు. మురుగు నీటి దుర్వాసనతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సీవరేజ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాహనాల రాకపోకలు బంద్

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా నిలిచిన వరద నీరు



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద వరద నీటిని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సు అండర్ బ్రిడ్జి కింద వరదలో నిలిచిపోయింది. మధ్యాహ్నం బస్సును అక్కడ నుంచి తొలగించారు. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరడంతో భారీగా నీరు నిలిచింది. జీహెచ్ఎంసీ ఏఈ సునీల్ సిబ్బంది వరద నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్ళించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత రాకపోకలు ప్రారంభమయ్యాయి. స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పర్యటించారు.

ఆలిండ్ ఎంప్లాయిస్ ప్రధాన రోడ్డులో వరద...

శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని ఆలిండ్ ఎంప్లాయిస్ కాలనీ ప్రధాన రోడ్డులో వరద నీరు భారీగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం 9 గంటలకు వరద నీరు వెళ్ళడంతో రాకపోకలకు మార్గం సుగమం అయింది.